క్లుప్తంగా

విద్యార్థులకు దంత పరీక్షలు



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శారదా మెటల్స్ అండ్ అల్లాయిస్ లిమిటెడ్, విశాఖపట్టణానికి చెందిన రౌండ్ టేబుల్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్టణానికి చెందిన దంత వైద్యులు 122 మంది చిన్నారులను పరీక్షించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అరుణ్‌కుమార్, కార్మాగార ప్రతినిధులు జి.శంకరరావు, దంత వైద్య నిపుణులు స్వీటీ, జోషి, ఎ.రాజ్‌పూత్, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాల పరిశీలన



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న సీఆర్‌పీ రామసూరి రెడ్డి

గజపతినగరం: మండలంలోని ఎస్‌జీఆర్ పురం పాఠశాలను సీఆర్‌పీ కె.రామసూరి రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాలను పరిశీలించడంతో పాటు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం విద్యార్థుల అభ్యసనా స్థాయిని పరిశీలించి, పలు సూచనలు చేశారు.

అమరవీరులకు నివాళులు..



అమరవీరుల స్థూపం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న నాయకులు

బొండపల్లి: మండలంలోని నెలివాడలో 'నా భూమి – నా దేశం' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, ప్రతిజ్ఞ చేశారు. సర్పంచ్ తాళ్లపూడి కీర్తి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు, అప్పారావు, ఉప సర్పంచ్ పురమనేని రాము, తదితరులు పాల్గొన్నారు.

87 మంది వైద్య పరీక్షలు



పాత శ్రీరంగరాజపురంలో రోగులను తనిఖీ చేస్తున్న డాక్టర్ సుష్మా

గజపతినగరం: మండలంలోని పాత శ్రీరంగరాజపురం గ్రామంలో బుధవారం నిర్వహించిన కుటుంబ వైద్యసేవల్లో భాగంగా 87 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేసినట్లు మరుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సుష్మ అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. డోలపాలెం గ్రామంలో కూడా వైద్య శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ కృష్ణప్రియాంక, ఆరోగ్య కార్యకర్త ఈశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ ఎంబీ నాయుడు, ఆశా కార్యకర్త కొండమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలో పూడిక తీత



కాలువలో పూడిక, పిచ్చి మొక్కలను తొలగిస్తున్న రైతులు

గుర్ల: మండలంలోని భూపాలపురం నుంచి నడుపూరు గ్రామం వరకు ఉన్న ఎస్‌పీ చానల్‌లో పూడికతీత పనులను జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు ఆధ్వర్యంలో రైతులు బుధవారం చేపట్టారు. కాలువలో పూడిక, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో చంపావతి నది నుంచి సాగు నీరు సక్రమంగా సరఫరా కాక రైతులు వరినాట్లు వేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వంద మంది రైతులు శ్రమదానం చేసి గజపతినగరం మండలం సీతారాంపురం నుంచి గుర్ల మండలంలోని భూపాలపురం వరకు పూడికలు, పిచ్చిమొక్కలు తొలగించారు.

సచివాలయాల్లో తనిఖీలు

వేపాడ: మండలంలోని బొద్దాం, రామస్వామిపేట గ్రామ సచివాలయాల్లో ఎంపీడీఓ బి.ఎస్.ఎస్.కూర్మనాథ్ పట్నాయక్ బుధవారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. అమ్మ ఒడి లబ్ధిదారులకు నగదు జమ, ఈ–సర్వీసులు, తదితర అంశాలపై సిబ్బందిని ఆరా తీశారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆయన సందర్శించారు. సర్పంచ్ వడ్లమాని శర్మ ఆయన వెంట ఉన్నారు.

చంద్రబాబువి కుట్రరాజకీయాలు



సీతాగొర్లెవానిపాలెంలో మహిళకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- సీఎం జగన్‌కు పెరుగుతున్న ప్రజాధరణను చంద్రబాబు ఓర్వలేకపోతున్నారు
- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి

లక్కవరపుకోట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధితో ఆయనకు ప్రజాధరణ రోజురోజుకూ పెరుగుతోందని, దాన్ని చూసి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, ఆ పార్టీ నాయకులు, ఎల్లో మీడియా ఓర్వలేక నిత్యం కుట్ర,కుటిల రాజకీయాలు చేస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు మండిపడ్డారు. మండలంలోని కళ్లేపల్లి పంచాయతీ శివారు గ్రామాలు సీతాగొర్లెవానిపాలెం, పూడివానిపాలెంలో బుధవారం'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి చేకూర్చిన లబ్ధిని వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. రెండు గ్రామాలకు త్వరలోనే బీటీరోడ్డు వేస్తామని, విద్యుత్ స్తంభాల సమస్యను పరిష్కరిస్తామని, ఇంటింటికీ తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ సీఎం జగన్ అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. పథకాలను పార్టీలకతీతంగా పారదర్శకంగా అందిస్తున్నామని అన్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతుండడంతో చంద్రబాబునాయుడు, టీడీపీ నాయకులు అధికారం కోసం మళ్లీ మాయమాటలు, బూటకపు హామీలు ఇస్తూ తిరుగుతున్నారని, వారిని ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు. చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ చేస్తున్న యాత్రలకు ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు తన ఎల్లో మీడియా ద్వారా తప్పుడు కథనాలు రాయిస్తూ, దుష్ప్రచారం చేస్తూ ప్రభుత్వంపై నిత్యం బురద జల్లుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు దిగజారుడు మాటలు, చేష్టలను ప్రజలు గమనిస్తున్నారని, ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ తూర్పాటి వరలక్ష్మి, సర్పంచ్ గోకేడ ముసలినాయుడు, రేగ ఎంపీటీసీ బొడ్డు గణపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు జెక్కాన సింహాద్రప్పడు, తూర్పాటి అప్పలరాజు, గేదెల శాంత, పెదిరెడ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వర్తించకుంటే చర్యలు



ఎనర్జీ అసిస్టెంట్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

- ఎనర్జీ అసిస్టెంట్లపై జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు ఆగ్రహం
- సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలి

మెరకముడిదాం: ఎనర్జీ అసిస్టెంట్లు సక్రమంగా విధులు నిర్వర్తించాలని, ఆటవిడుపుగా పని చేస్తామంటే మాత్రం శాఖాపరమైన చర్యలు తప్పవని మండలానికి చెందిన 17 మంది ఎనర్జీ అసిస్టెంట్లపై జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షత న బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన అతిథిగా హాజరయ్యారు.శాఖల వారీగా ప్రగతి, సిబ్బంది పనితీరుపై సమీక్ష నిర్వహించారు. విద్యుత్ శాఖ సిబ్బందిపై పలువురు సభ్యుల నుంచి ఫిర్యాదులు అందడంతో జెడ్పీ చైర్మన్ స్పందించారు. ఎనర్జీ అసిస్టెంట్లు, లైన్‌మన్లు, ఇతర విద్యుత్‌శాఖ సిబ్బంది గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించకుండా, ప్రజలకు అందుబాటులో లేకుండా ఇష్టానుసారం తిరుగుతామంటే కుదరదని, పనిచేయని వారిపై చర్యలు తప్పవని చైర్మన్ హెచ్చరించారు. మండలంలో గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ త్వరగా పూర్తి చేయించాలని సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను చైర్మన్ ఆదేశించారు. సచివాలయ సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు సచివాలయంలో అందుబాటులో ఉంటూ ప్రజలు తమ సమస్యలపై అందించే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపించాలని అన్నారు. సిరియాలపేటలో సీసీరోడ్డు, అలాగే ప్రధాన రహదారిని ఆనుకొని కాలువ నిర్మించాలని కొర్లాం ఎంపీటీసీ సభ్యురాలు జంపన సావిత్రమ్మ కోరారు. అలాగే పలువురు సభ్యులు తమ గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్న విద్యుత్ స్తంభాలను మార్చాలని కోరారు. జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ ఏయే గ్రామాల్లో కొత్తగా ఎన్ని విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉందో సభ్యుల నుంచి వివరాలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. బిళ్లలవలస నుంచి ఇప్పలవలస గ్రావెల్ రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేయాలని బిళ్లలవలస సర్పంచ్ వర్మరాజు కోరారు. జెడ్పీ చైర్మన్ స్పందిస్తూ బీటీ రోడ్డు మంజూరయ్యింది కదా..? పనులు ప్రారంభించకుండా ఎందుకు ఆలస్యం చేస్తున్నారని, వెంటనే పనులు చేపట్టాలని పీఆర్ ఏఈ హరికృష్ణను ఆదేశించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) వెనుక ఉన్న పాత బాలికల వసతి గృహాన్ని వినియోగించుకోవాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి బేగంకు సూచించారు. గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలని పీఆర్ ఏఈని ఆదేశించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, వైస్ ఎంపీపీ టి.హరిబాబు, తహసీల్దార్ విజయభాస్కర్, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీకి వైఎస్సార్‌సీపీ అగ్రిమెంట్ ఛాలెంజ్

- 2024లో మంత్రి బొత్స గెలవకపోతే రాజకీయ సన్యాసానికి సిద్ధం
- కిమిడి నాగార్జున గెలవకపోతే మీరు సిద్ధమా..?
- నేడు అమ్మవారి గుడిలో అగ్రిమెంట్‌కు రావాలని టీడీపీకి సవాల్



అగ్రిమెంట్ కోసం సిద్ధం చేసిన పత్రాన్ని చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: నియోజకవర్గంలో టీడీపీ నాయకులకు గెలిచే దమ్ములేక చర్చను పక్కదోవ పట్టిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో గెలుపు, రాజకీయ సన్యాసం అనే అంశంపై అగ్రిమెంట్ చేసుకునేందుకు ధైర్యం ఉంటే రావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీ నాయకులకు అగ్రిమెంట్ ఛాలెంజ్ విసిరారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాల యం లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎంసీ చైర్మన్ దన్నా న జనార్ధనరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బెల్లాన త్రినాథరావు, సర్పంచ్ మీసాల రమణ, పీఏసీఎస్ అధ్యక్షుడు చందక గురునాయుడు, కోరుకొండ దాలయ్య, గొర్లె రమణ మాట్లాడారు. టీడీపీ నాయకులు ఒట్టి మాటలు కట్టిపెట్టి కనకమహాలక్ష్మి అమ్మవారి సన్నిధి లో అగ్రిమెంట్‌కు రావాలన్నారు. గురువారం ఉదయం 10.30 గంటలకు వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో సహా అమ్మవారి సన్నిధిలో స్టాంప్ పేపర్‌తో తాము సిద్ధంగా ఉంటామని చెప్పారు. 2024 ఎన్నికల్లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణను గెలిపించుకోలేకపోతే తామంతా రాజకీయ సన్యాసం తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కిమిడి నాగార్జున ఓడిపోతే ఆ పార్టీ మండల నాయకులు రాజకీయ సన్యాసం తీసుకుంటారా అని సవాల్ విసిరారు. ఈ చాలెంజ్‌కు టీడీపీ నుంచి గతంలో ఎంపీపీ, జెడ్పీటీసీలుగా పదవులు అలంకరించిన వారు మాత్రమే రావాలని, తమ పార్టీ నుంచి కూడా ప్రస్తుత ఎంపీపీ, జెడ్పీటీసీలు , ఆస్థాయి నాయకులే వస్తారని తెలిపారు. టీడీపీ నేత రౌతు కామునాయుడుకు మంత్రి బొత్సను విమర్శించే స్థాయి లేదని, అయిదేళ్లు ఎంపీపీగా పని చేసి మండలానికి ఆయన ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులపై సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టిపెట్టాలని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. గరివిడి మండలంలోని కొండపాలెం మేజర్ పంచాయతీలో బుధవారం చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. డీపీఓ శ్రీధర్‌రాజు, ఎంపీడీఓ జి. భాస్కరరావు, జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, బమ్మిడి అప్పలస్వామి, స్థానిక ఉప సర్పంచ్ బి.కార్తీక్, మండల జేసీ ఎస్ ఇన్‌చార్జి పొన్నాడ కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు లెంక శ్రీరాములు, నాయకులు వలిరెడ్డి లక్ష్మణ, పి.కుమార్, రమణమూర్తి, పంచాయతీ వార్డు మెంబర్లు జెడ్పీ చైర్మన్ వెంట ఉన్నారు.

నేడు జేసీఎస్ కన్వీనర్లతో సమావేశం

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో గల సత్య ఫంక్షన్ హాల్‌లో గురువారం సాయంత్రం 3 గంటలకు నియోజకవర్గంలోని సచివాలయం కన్వీనర్లతో పాటు జేసీఎస్ మండల కన్వీనర్లతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, ఎంపీటీసీ సభ్యులు, ఏఎంసీ చైర్మన్లు హాజరుకావాలని కోరారు.

చీపురుపల్లిలో...

చీపురుపల్లి: నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ల సమావేశం పట్టణంలోని రాధామాధవ ఫంక్షన్ హాలులో గురువారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ చీపురుపల్లి మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్న సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారని ర్కొన్నారు. చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాలకు చెందిన సచివాలయ కన్వీనర్లు, అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ప్రధాన నాయకులు హాజరుకావాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ భానోజీరావు

గంట్యాడ: మండలంలోని పెంటశ్రీరాంపురం గ్రామ సర్పంచ్ స్థానానికి ఈనెల 19వ తేదీన ఉపఎన్నిక నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ భానోజీరావు బుధవారం పరిశీలించారు. ఎన్నికల నిర్వాహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని అధికారులకు ఆయన సూచించారు. ఓటర్లకు తాగునీరు అందుబాటులో ఉంచాలని తెలిపారు. సీఐ తిరుపతిరావు, ఎస్ఐ కిరణ్‌కుమార్‌నాయుడు, కార్యదర్శి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్సార్ మూర్తి సేవలు ఎనలేనివి

- ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ



డాక్టర్ బీఎస్సార్ మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, తదితరులు

గజపతినగరం: దివంగత బీఎస్సార్ మూర్తి వైద్యరంగంలో అందించిన సేవలు ఎనలేనివని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, నెల్లిమర్ల ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని సాయిసిద్ధార్థ కళాశాల సమీపంలో మూర్తి దశదిన కర్మ బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే, తదితరులు మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కర్నాటక డీజీపీ ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీ నరేన్, మాజీమంత్రి పడాల అరుణ, ఐదు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, వైద్య సిబ్బంది, లయన్స్, చైతన్యభారతి, ప్రేమసమాజం సిబ్బంది, సీఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్సై గంగరాజు, తదితరులు నివాళులర్పించారు.

విత్తన బంతుల తయారీపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సుస్థిర వ్యవసాయ కేంద్రం సిబ్బంది

వేపాడ: బొద్దాం సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజనల్ కో–ఆర్డినేటర్ వెంకటరావు ఆధ్వర్యంలో బొద్దాం ఉన్నత పాఠ శాలలో విద్యార్థులకు విత్తనబంతుల తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. వివిధ రకాల విత్తనాలను మట్టిలో కలిపి బంతులు చేయించారు. వీటిని పాఠశాలకు సంబంధించిన మూడు ఎకరాల స్థలంలో చల్లారు. విత్తన బంతులను ఖాళీ స్థలాల్లో వేయడం వల్ల వర్షాలకు వాటిలోని విత్తనాలు మొలకెత్తుతాయని వెంకటరావు తెలిపారు. హెచ్ఎం భాస్కరరావు, సుస్థిర వ్యవసాయ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్లపై అప్రమత్తంగా ఉండండి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు

విజయనగరం క్రైమ్: సైబర్ మోసగాళ్లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ బి. వెంకటరావు అన్నారు. నగరంలోని ఉడాకాలనీలో సైబర్ మోసాలు, చిట్టీలు, దొంగతనాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, మొబైల్స్‌కు వచ్చే లింకులు, కేవైసీ అప్‌డేట్ పేరుతో మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ మోసాలకు పాల్పడే మోసగాళ్లు బ్యాంకు ఖాతాల్లో ఉన్న సొమ్మును కాజేసేందుకు అనేక రకాలుగా మెసెజ్‌లు, వాట్సాప్ సందేశాలు, ఈమెయిల్స్ పంపిస్తుంటారన్నారు. అటువంటి వాటికి ఎవ్వరూ స్పందించవద్దని సూచించారు. ఎక్కువ వడ్డీల ఆశతో చీటీలు వేసే వారి పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్లు విడిచి దూర ప్రాంతాలకు వెళ్లే ముందు స్థానిక పోలీస్‌స్టేషన్‌కు ముందుగా సమాచారం అందిస్తే, ఆయా ఇళ్లపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కెమికల్ ఇంజినీరింగ్‌తో ఉపాధి అవకాశాలు



ముఖ్య అతిథి సీతారాంను సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

డెంకాడ: కెమికల్ ఇంజినీరింగ్‌తో మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని షెల్ ఇంటర్నేషనల్ కంపెనీ రిటైర్డ్ కెమికల్ సేఫ్టీ అడ్వైజర్ ఎస్.సీతారాం అన్నారు. చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మా ట్లాడుతూ, పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు భద్రతా నియమాలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సీతారాంను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.సీతారామరాజు, ప్రిన్సిపాల్ ఆర్.రమేష్, కెమికల్ విభాగాధిపతి బి.సత్యారావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామ పంచాయతీలో 13 వార్డు సభ్యుని ఎన్నికకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సీహెచ్ సుగుణాకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీన ఎన్నిక జరగనుందని పేర్కొన్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ రోజు ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నిక నిర్వహిస్తామన్నారు. 233 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు.

అజొల్లాతో ఉపయోగాలు..

డెంకాడ: అజొల్లా ఉండగా యూరియా దండగ అని ప్రకృతి వ్యవసాయశాఖ రాష్ట్ర కార్యాలయ ఆర్‌టీఎల్ ప్రకాష్ అన్నారు. మండలంలోని సింగవరంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అజొల్లాతో కలుపును సులువుగా తొలగించవచ్చన్నారు. వరి పంటలో తేమశాతం పెరిగి పిలకలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు. రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలని సూచించారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు రైతుల వరి పొలాల్లో రైతులతో కలిసి అధికారులు అజొల్లా వేశారు. కార్యక్రమంలో ఆర్‌టీఓ హేమసుందర్, ఏఈఓ రామకోటి, ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి సుజాత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



గజపతినగరం: అగ్నిప్రమాదాల నివారణపై అవగాహణ కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

గజపతినగరం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీక్ వల్ల సంభవించే అగ్ని ప్రమాదాల్లో మంటలను ఎలా అదుపు చేయాలి.. ఎటువంటి నష్ట నివారణ చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక సిబ్బంది వివరించారు. పురిటిపెంట న్యూ కాలనీలో ఉన్న సూపర్ ఎంమార్ట్ వద్ద బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖాధికారి ఎంఎస్‌వి రవి, సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తవలస: అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాఠశాలలో..

కొత్తవలస: మండలంలోని సబ్బవరం రోడ్డులో గల గాయత్రీ విద్యామందిర్ పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక శాఖాధికారి వై.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రమాద సమయంలో ఆందోళన చెందకుండా, సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.పూర్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఏవై.ఆచారి, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల వితరణ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు

లక్కవరపుకోట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సత్యసాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సల్ వెల్ఫేర్ సభ్యులు 5,200 నోట్ పుస్తకాలను వితరణగా అందజేశారు. ఈ మేరకు కిత్తన్నపేట ప్రాథమిక పాఠశాలలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు చేతులమీదుగా బుధవారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, సత్యసాయ ట్రస్ట్ వారు గ్రామీణ విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి అమోఘమన్నారు. ఇప్పటికే మండలంలోని మల్లివీడు, గనివాడ, గంగుబూడి గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి ఉచితంగా శుద్ధజలం అందజేస్తున్నారని కొనియాడారు. ట్రస్ట్ ప్రతినిధులు రాజగోపాల్, పార్థసారథి మాట్లాడుతూ, శ్రీసాయి వికాస్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కిత్తన్నపేటలో త్వరలో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓలు సీహెచ్.కూర్మారావు, శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ దుక్క రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పిల్లల జ్యోతిరామ్, కొట్యాడ శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి కృషి మరువలేనిది



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న గద్దే బాబూరావు

చీపురుపల్లి: దేశాభివృద్ధిలో మాజీ ప్రధానమంత్రి అటల్ బీహారీ వాజ్‌పేయి చేసిన కృషి మరువలేనిదని బీజేపీ విజయనగరం పార్లమెంటు కన్వీనర్ గద్దే బాబూరావు అన్నారు. పట్టణంలోని ఓ హోటల్‌లో వాజ్‌పేయి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశంలో వాజ్‌పేయి వేసిన అభివృద్ధి బాటలు ఇప్పటికీ ఆదర్శంగానే ఉన్నాయన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటగిరి నారాయణరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దంతినాడ అప్పలాచారి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ గుడివాడ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోండి



మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

గంట్యాడ: ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని డీఎస్పీ గోవిందరావు ఓటర్లకు సూచించారు. మండలంలోని పెంటశ్రీరాంపురం గ్రామంలో ఈనెల 19వ తేదీన సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు ఉప ఎన్నిక నిర్వహించనున్నారు. ఈనేపథ్యంలో గ్రామస్తులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అంతా సహకరించాలని కోరారు. సీఐ టి.వి. తిరుపతిరావు, ఎస్ఐ కె. కిరణ్‌కుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.